సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 7 । జనవరి । 2023



బీజేపీని ఎదుర్కొందాం

మతం పేరిట దేశాన్ని నాశనం చేస్తున్న బీజేపీని సమష్టిగా ఎదుర్కోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని పిలుపునిచ్చారు. 8లో



పన్నెండేళ్ల తర్వాత పరీక్ష

ఆలయాల్లో అర్చకత్వం చేసేందుకు అర్హులైన వారిని గుర్తించేందుకు ప్రభుత్వం 12 ఏళ్ల తర్వాత ఆగమ పరీక్షలు నిర్వహిస్తోంది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
31° / 14°

జిల్లాలో శనివారం ఉదయం, రాత్రి వేళల్లో చలి అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

బాబోయ్.. దొంగలు !

- జిల్లాలో పెరుగుతున్న చోరీలు
- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- వీధుల్లో రెచ్చిపోతున్న చైన్ స్నాచర్లు
- పోలీసు శాఖకు సవాల్‌గా మారిన ఘటనలు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో వరుసగా చోరీలు జరుగుతున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. వరుస దోపిడీ ఘటనలు జిల్లా వాసులను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. కాగా ఈ దొంగతనాలకు పాల్పడుతోంది ఇంటి దొంగలా, స్థానికంగా నేర చరిత్ర ఉన్నవారా లేక అంతర్రాష్ట్ర ముఠా పనా అనేది ఇంకా తేలలేదు.

వరుస ఘటనలతో బెంబేలు..

జిల్లాలో నూతన సంవత్సరం ఆరంభానికి ముందు మొదలైన దొంగతనాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని ముష్కరులు రెచ్చిపోతున్నారు. ఇటీవల పాల్వంచ మండల పరిధిలో చోటుచేసుకున్న రెండు చోరీల విషయంలో తాళం వేసి ఉంచిన ఇళ్లు, కార్యాలయాలే టార్గెట్ అయ్యాయి. అంతకుముందు బూర్గంపాడు మండలం సారపాకలోనూ తాళం వేసిన ఇంట్లో, దమ్మపేటలో ఓ ఆలయంలో హుండీలోని సొమ్మును చోరీ చేశారు. తాజాగా కొత్తగూడెం పట్టణంలోని లక్ష్మీదేవిపల్లిలో బజాజ్ షోరూమ్‌లో చోరీకి పాల్పడ్డారు. గతేడాది నవంబర్ 10న భద్రాచలం పట్టణంలో తాళం వేసి ఉన్న ఇంట్లో రూ.2.38 లక్షల విలువైన బంగారు, వెండి అభరణాలతో పాటు కొంత నగదు అపహరించారు.

అంతర్ రాష్ట్ర దొంగలా.. ?

గతేడాది సెప్టెంబర్‌లో జిల్లాలో దొంగతనాలు ఎక్కువగా జరిగాయి. ముఖ్యంగా అశ్వారావుపేట పరిధిలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా సంచరిస్తోందనే ప్రచారం ముమ్మరంగా సాగింది. రాత్రి వేళ గుర్తుతెలియని వ్యక్తులు తలుపు కొడుతున్నారని, తమ వాళ్లేమోనని తలుపులు తీస్తే దోపిడీకి పాల్పడుతున్నారనే ప్రచారం ఊపందుకుంది. ఇదే క్రమంలో అశ్వారావుపేట మండలం గట్టుగూడెంలో ఏడుగురు సభ్యులతో కూడిన ముఠా దోపిడీకి పాల్పడింది. దీంతో ఒక్కసారిగా అప్రమత్తమైన పోలీసులు గస్తీ పెంచారు. ఫలితంగా దొంగతనాలతో పాటు అంతర్రాష్ట్ర దొంగల సంచారం అనే వదంతులు సైతం తగ్గుముఖం పట్టాయి. మళ్లీ గత వారం రోజులుగా జరుగుతున్న దొంగతనాలతో మరోసారి దొంగల ముఠా జిల్లాలో సంచరిస్తోందనే వదంతులు వ్యాపిస్తున్నాయి. గతంలో ఇల్లెందు పట్టణంలో వరుస దొంగతనాలు జరిగాయి. ఇది అంతర్రాష్ట్ర దొంగల ముఠా పనే అనే ప్రచారం జరిగింది. స్థానిక యువకులు జట్లుగా ఏర్పడి వీధుల్లో రాత్రి వేళ రక్షణగా ఉన్నారు. అయితే ఇక్కడి చోరీలపై పోలీసులు కూపీ లాగగా వరుస దొంగతనాలకు పాల్పడింది జిల్లావాసే అని తేలింది. అవసరమైనప్పుడు చోరీలకు పాల్పడుతూ, మిగిలిన సమయాల్లో సాధారణ జీవితం గడిపేవాడని వెల్లడైంది. ఆ వ్యక్తిని పోలీసులు కటకటాల వెనక్కి నెట్టారు. ప్రస్తుతం జరుగుతున్న చోరీల తీరును పరిశీలిస్తే అంతర్రాష్ట్ర ముఠా పని అన్నట్టుగా లేదని, పోలీసు వర్గాలు అంటున్నాయి. అయితే ఈ చోరీలకు పాల్పడేది ఎవరు, అందుకు కారణాలు ఏంటనే అంశాలపై ఖాకీలు ఫోకస్ పెట్టారు.

అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు..

తాళం వేసిన ఇళ్లు, కార్యాలయాలే లక్ష్యంగా చోరీలు, వీధుల్లో చైన్ స్నాచింగ్‌లు పెరగడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు చెబుతున్నారు. ఎవరైనా ఇల్లు విడిచి ఇతర గ్రామాలకు వెళితే తమకు సమాచారం అందివ్వాలని సూచిస్తున్నారు. విలువైన అభరణాలు ధరించే వారు అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు. అనుమానితులు కనిపిస్తే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

గల్లీల్లో చైన్‌స్నాచర్లు..

ఓ వైపు తాళం వేసిన ఇళ్లు చోరులకు టార్గెట్ కాగా, గల్లీల్లో చైన్‌స్నాచర్లు హల్‌చల్ చేస్తున్నారు. అంతగా జనసంచారం ఉండని వీధులను ఎంచుకుని, ఆ మార్గంలో వెళ్లే మహిళల నుంచి బంగారు ఆభరణాలు దోచుకుంటున్నారు. కొత్తగూడెంలోని గాజులరాజం బస్తీలో ఉదయం వేళ వాకింగ్ చేస్తున్న మహిళ మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు స్నాచర్ చేతిలో పడగా అంతకుముందు అశ్వారావుపేటలో హెల్మెట్



పెట్టుకుని బైక్‌పై వచ్చిన ఇద్దరు స్నాచర్లు బంగారుగొలుసు అపహరించారు.

పదికి పది.. అదే లక్ష్యం!



రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, అజయ్‌కుమార్, పక్కన ఎంపీలు, ఎమ్మెల్యేలు

- సీఎం కేసీఆర్‌కు ఉమ్మడి జిల్లాను కానుకగా ఇవ్వాలి
- రాష్ట్ర మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది సీట్లు సాధించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, తల్లాడ, కల్లూరు మండలాల్లో రూ.68.90 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్ల నిర్మాణ పనులకు మంత్రులు శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మంరూరల్ మండలం రామన్నపేట, తల్లాడ, కల్లూరు మండలం చెన్నూరుల్లో నిర్వహించిన సభల్లో మంత్రి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటుకు ముందు జిల్లాలోని అన్ని ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందాయో ప్రజలు గమనించాలని కోరారు. పాలేరులో గత ఎనిమిదేళ్లుగా ఎంత అభివృద్ధి జరిగిందో ఆలోచించాలన్నారు. కాగా, పాలేరులో కందాల ఉపేందర్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరని, ఉపేందర్‌రెడ్డి అంటే సీఎం కేసీఆర్‌కు చాలా ఇష్టమని తెలిపారు. ఇక సండ్ర వెంకటవీరయ్య సీనియర్ ఎమ్మెల్యే అని, రాష్ట్రంలో రోడ్ల నిర్మాణాలకు రూ.2,500 కోట్లు కేటాయిస్తే అందులో సత్తుపల్లి నియోజకవర్గానికే రూ.55 కోట్లు కేటాయించడం ఆయన కృషి ఫలితమేనని చెప్పారు. ఇలాంటి ఎమ్మెల్యేను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశీర్వదించాలి

గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి జరిగిందని.. ఈ విషయాన్ని ప్రజలు గమనించి బీఆర్‌ఎస్‌కు పదికి పది సీట్లు ఇచ్చి ఆశీర్వదించాలని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, మిషన్ భగీరథకు రూ.40వేల కోట్లు, మిషన్ కాకతీయకు రూ.20వేల కోట్లు ఖర్చు పెట్టామని వివరించారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాకే తెలంగాణలో అట్టడుగున ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అభివృద్ధి జరిగిందని, జిల్లాకు నిధులు రాబట్టగలిగామని తెలిపారు. పాలేరు నుంచి భద్రాచలం దగ్గర దుమ్ముగూడెం, చర్ల వరకు ఉన్న ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానని.. ప్రజలంతా కేసీఆర్‌కు కృతజ్ఞత తెలియజేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

రూ.50 వేల కోట్లతో ప్రాజెక్టులు

ఉమ్మడి జిల్లాకు ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.50 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు ఇచ్చారని బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఎంపీ నామ నాగేశ్వరరావు తెలిపారు. ఫలితంగానే ఇక్కడ ఇంత అభివృద్ధి జరిగిందన్నారు. దానవాయిగూడెం–పాపటపల్లి మధ్య ఒకవైపు కెనాల్, మరోవైపు రైల్వేలైన్, ఇవతల గ్రామాలు ఉండగా.. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఈ రోడ్డు గురించి చెబుతున్నారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పట్టుబట్టడంతో రోడ్డు మంజూరు చేసిన మంత్రి ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. దేశం మొత్తం కేసీఆర్ వైపు చూస్తోందని, తెలంగాణ మోడల్ అభివృద్ధి దేశంలో జరగాలని ప్రజలంతా కోరుకుంటున్నారని అన్నారు. సింగరేణి ప్రైవేట్‌పరం కాకుండా అడ్డుకుంటామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండలంలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం పంచామృతాలతో అభిషేకం చేశారు. ముందుగా మేళతాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చన నిర్వహించారు. కాగా, పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో చండీ హోమం జరిపించారు. అంతకుముందు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, వేద మంత్రాలతో యాగశాలకు తీసుకొచ్చారు. గణపతి పూజ, పుణ్యావాచనం, మండపారాధన తర్వాత హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు పురాణం రవికుమార్‌శర్మ, దుర్గప్రసాద్ శర్మ, ఈఓ ఎస్.రజనికుమారి తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు - మన బడి పనుల్లో వేగం పెంచండి

ప్రోగ్రామ్ అదనపు డైరెక్టర్ శ్రీనివాసాచారి



సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న శ్రీనివాసాచారి

ఇల్లెందురూరల్: పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు వేగవంతం చేయాలని మన ఊరు – మన బడి కార్యక్రమ అదనపు డైరెక్టర్ శ్రీనివాసాచారి సూచించారు. మండలంలోని సంజయ్‌నగర్ ప్రాథమిక పాఠశాల, పట్టణంలోని స్టేషన్‌బస్తీ, ఉర్దూ మీడియం పాఠశాలల్లో నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో ప్రతి గదిని పరిశీలించి నిర్మాణాల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే తరహాలో అన్ని పాఠశాలల్లోనూ పనులు వేగవంతం చేయాలన్నారు. పాఠశాల సుందరీరకరణ పనులను ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ ఏఈ రాంబాబు తదితరులు ఉన్నారు.

వైద్య కళాశాలలో వైట్ కోట్ సెర్మనీ



విద్యార్థులకు వైట్‌కోట్‌లు అందజేస్తున్న ప్రిన్సిపాల్

చుంచుపల్లి: కొత్తగూడెం మెడికల్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులు వైట్‌కోట్ వేడుకలు నిర్వహించారు. కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులందరికీ డాక్టర్ కోట్ దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్య విద్య అభ్యసనం, క్రమశిక్షణపై ప్రొఫెసర్లు అవగాహన కల్పించారు. మెడికల్ కళాశాల తొలి బ్యాచ్ విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాలని, తల్లిదండ్రుల ఆశయాలను సాధించాల ని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ లక్ష్మణ్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, సూపరింటెండెంట్ కుమారస్వామి, డాక్టర్ మోకాళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ ‘కొత్తగూడెం పాలిటెక్నిక్’

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 5, 6 తేదీల్లో కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో కొత్తగూడెం పాలిటెక్నిక్ కళాశాల జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ బి.నాగమునినాయక్ తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులకు శుక్రవారం ఆయన మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలతో శరీర దారుఢ్యం పెరుగుతుందని, మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. కళాశాలలో నాలుగు గోడల మధ్యే పరిమితం కాకుండా ప్రతిరోజూ ఏదో ఒక ఆట ఆడాలని సూచించారు. ఏ ఆటలోనైనా గెలుపోటములు సహజమని, గెలిచినా, ఓడినా సమానంగా స్వీకరించాలని అన్నారు.

స్వర్ణకవచధారుడైన భద్రాద్రి రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

గోవిందరాజు సన్నిధిలో రాపత్తు సేవ..

గోవిందరాజు సన్నిధిలో రామయ్యకు రాపత్తు సేవ వైభవంగా జరిగింది. వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా తాతగుడి సెంటర్‌లో గల గోవిందరాజు ఆలయంలో రాపత్తు సేవ జరిపారు. తొలుత పల్లకీలో స్వామివారిని మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో కొలువుదీర్చారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు.

ప్రతీ గిరిజనుడికి ప్రభుత్వ పథకాలు

- ‘గిరివికాసం’తో గిరిజనులకు లబ్ధి
- ట్రైకార్ చైర్మన్ రామచంద్రనాయక్



ట్రైకార్ చైర్మన్ రామచంద్రనాయక్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఐటీడీఏ అధికారులు

భద్రాచలం: ఐటీడీఏ ద్వారా ప్రతీ ప్రభుత్వ పథకాన్ని గిరిజనుల చెంతకు చేర్చేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ రామచంద్రనాయక్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం ఆయన ట్రైకార్ జీఎం శంకర్‌రావు, రాష్ట్ర మిషన్ మేనేజర్ లక్ష్మీప్రసాద్‌తో కలిసి పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద గిరిజన రైతులకు గిరివికాసం ద్వారా వందశాతం సబ్సిడీతో 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేయడమే కాక విద్యుత్ కనెక్షన్, బోరు మోటార్ ఇస్తున్నట్లు తెలిపారు. అయితే, ఈ పథకాన్ని గిరిజనులు వినియోగించుకుని అభివృద్ధి చెందేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో గతంతో పోలిస్తే ఇప్పుడు గిరిజన గ్రామాల్లో ఎంతో మార్పు వచ్చిందని అన్నారు. కాగా, ఏజెన్సీ ప్రాంత గిరిజనులు డెయిరీ ఫామ్‌ల ఏర్పాటు, విద్యార్హతలు ఉన్న వారు ఉద్యోగాలకు సిద్ధమయ్యేలా అవగాహన కల్పిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని చెప్పారు. ఎంఎస్‌ఎంఈ, గిరి వికాసానికి సంబంధించి మిగిలిన యూనిట్లకు మార్చి 31 వరకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. అనంతరం గిరివికాసం పథకం ద్వారా మంజూరైన బోర్లను గిరిజన రైతులకు అందజేశారు. నాయకపోడు గిరిజనులు కళాఖండాలు తయారుచేస్తున్న కేంద్రాన్ని పరిశీలించి ప్రభుత్వం తరఫున చేయూతనిస్తామని వెల్లడించారు.

ఉత్పత్తిదారుల సంఘాలతో రైతులకు మేలు..

ఇల్లెందురూరల్: మారుమూల ప్రాంతాల రైతులు సజావుగా వ్యవసాయం చేసి, ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేశామని రామచంద్రనాయక్ తెలిపారు. మండలంలోని ధర్మాపురంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం సలహాలు, సూచనలు అందించాలని అన్నారు. కాలానుగుణంగా ఎలాంటి పంటలు వేయాలో అవగాహన కల్పించాలని కోరారు. త్వరలోనే గిరిజన ఆవాసాలకు త్రీఫేస్ కరెంటు ఏర్పాటు చేస్తామని, పోడు రైతులకు పట్టాలు అందించేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, జీసీసీ డీఎం విజయ్‌కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ రమాదేవి, ట్రైకార్ జీఎం శంకర్‌రావు, స్టేట్ మిషన్ మేనేజర్ లక్ష్మీప్రసాద్, ఎస్‌ఓ సురేష్‌బాబు, వ్యవసాయ శాఖ ఏడీ భాస్కర్, అశోక్‌కుమార్, భీం, సురేశ్‌బాబు భాస్కరన్, సొసైటీ చైర్మన్ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు కృషి చేయండి

ఎస్పీ వినీత్



మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: బాలల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆపరేషన్ స్మైల్ స్పెషల్ డ్రైవ్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 5 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సాంఘికంగా, ఆర్థికంగా ఇతర కారణాలతో అణచివేతకు గురవుతున్న బాలలను రక్షించేందుకు సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. చిన్నారులను ఎలా రక్షించాలనే విషయాలపై చర్చించినట్లు వివరించారు. సమావేశంలో డీసీఆర్బీ డీఎస్పీ నందిరామ్, షీటీం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమాదేవి, జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనీనా, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు అంబేద్కర్, సాదిక్‌పాషా, సుమిత్రాదేవి, డిస్ట్రిక్ట్ చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ అధికారి హరికుమారి, లీగల్ ఆఫీసర్ శివకుమారి పాల్గొన్నారు.


నేరస్తులకు శిక్షపడేలా సహకరించాలి

సాక్షులు ధైర్యంగా సాక్ష్యం చెప్పి న్యాయాన్ని గెలిపించాలని ఎస్పీ వినీత్ అన్నారు. 2015లో పాల్వంచలో జరిగిన హత్యకు సంబంధించిన కేసులో సాక్షులతో కొత్తగూడెం క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. నిర్భయంగా సాక్ష్యం చెప్పి పోలీసులకు, న్యాయవాదులకు సహకరించాలని కోరారు. బాధిత కుటుంబాలకు తమ శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కాగా జిల్లాలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఈవెంట్లలో అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్ పరీక్షకు తాము నిర్వహించే ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ఒక ప్రకటనలో కోరారు. ఇందు కోసం జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరిచిన లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

రేపు భద్రాద్రిలో స్వర నీరాజనం

భద్రాచలంటౌన్: భద్రాచలం వేదికగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డు కోసం ఈ నెల 8న 111 మంది గాయనీ గాయకులచే నిర్విరామ సినీ సంగీత గానలహరి కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని, కళాకారులు, కళాభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఏరియా ఆస్పత్రిలో కాయకల్ప బృందం తనిఖీ



ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిని కాయకల్ప బృందం శుక్రవారం తనిఖీ చేసింది. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు, శానిటేషన్, వైద్య సేవలు, భోజనం, మందుల పంపిణీ తదితర అంశాలపై బృందం సభ్యులు ఆరా తీసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణను అభినందించారు. ఈ బృందంలో ములుగు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీష్, హెడ్ నర్స్ రాధ, విజయలక్ష్మి ఉన్నారు. కార్యక్రమంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంఓలు రాజశేఖర్ రెడ్డి, దేవిక తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ, వ్యయ వివరాలు సమర్పించాలి

ఉద్యోగులకు కలెక్టర్ సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన ఎస్పీ వినీత్, అదనపు కలెక్టర్ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ ఉద్యోగులు ఆదాయ, వ్యయ వివరాలను సకాలంలో సమర్పించాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఆదాయ పన్ను శాఖ ఆధ్వర్యంలో అన్ని శాఖల జిల్లా అధికారులకు టీడీఎస్, ఈ ఫైలింగ్, ఆదాయ, వ్యయ పట్టికల రూపకల్పన తదితర అంశాలపై కొత్తగూడెం క్లబ్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఖర్చు చేసే నిధులు ఆదాయ, వ్యయాల చెల్లింపుల ద్వారానే అధికంగా సమకూరుతాయని అన్నారు. ప్రతి ఉద్యోగి ఆదాయ, వ్యయ వివరాలను క్రమం తప్పకుండా టీడీఎస్ చేయించాలన్నారు. ఆలస్యమైతే ఐటీ శాఖ నుంచి నోటీసులు వస్తాయని, అప్పుడు న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాధ్యతగా పన్ను చెల్లించాలని కోరారు. జీడీపీలో ఆదాయ పన్ను చాలా విలువైనదని చెప్పారు. ఐటీ శాఖ ఉప కమిషనర్ డాక్టర్ సుధాకర్‌నాయక్ టీడీఎస్, ఈ ఫైలింగ్, ఆదాయ వ్యయ వివరాల నివేదికల రూపకల్పనలో అనుసరించాల్సిన నియమ నిబంధనలు తదితర అంశాలపై వివరించారు. సదస్సులో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఐటీ అధికారి బాలరాజు, సింగరేణి జీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాది యాత్రకు ‘వ్యవసాయ’ విద్యార్థులు



టూర్‌కు వెళ్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలోని 2020 బ్యాచ్‌కు చెందిన 101 మంది విద్యార్థులు శుక్రవారం సౌత్ ఇండియా టూర్‌కు బయలుదేరి వెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మూడు ఆర్టీసీ బస్సుల్లో ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో పది రోజుల పాటు పర్యటించనున్నారు. ఆయా రాష్ట్రాల్లోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ఐకార్ అనుబంధ కళాశాలలు, ఉద్యాన క్షేత్రాలు, వివిధ రకాల పంటలపై అధ్యయనం చేస్తారు. వ్యవసాయరంగంలో అందుబాటులోకి వస్తున్న కొత్త టెక్నాలజీపై అవగాహన పొందేలా ఈ టూర్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల వెంట కళాశాల ప్రొఫెసర్లు కె.కోటేశ్వరరావు, శిరీష, శ్రీలత, రమేష్ వెళ్లారు.

క్లుప్తంగా

పౌరసరఫరాల శాఖ అధికారుల దాడులు



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

అశ్వాపురం: మండల కేంద్రంలో దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లలో పౌరసరఫరాలశాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల వినియోగంపై దుకాణాల్లో సివిల్ సప్లై అధికారులు దాడులు చేపట్టి 22 డొమెస్టిక్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. ఇళ్లల్లో వినియోగించే డొమెస్టిక్ సిలిండర్లను దుకాణాల్లో వినియోగించవద్దని అధికారులు సూచించారు. దాడుల్లో మణుగూరు, భద్రాచలం, పాల్వంచ పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్లు సుంకరి శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, సోయం కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుమందు డబ్బాతో నిరసన



నిరసన తెలుపుతున్న వెంకన్న

పాల్వంచరూరల్: మండలంలోని యానంబైల్ గ్రామ పంచాయతీ నూతన భవనం నిర్మించి మూడేళ్లు గడిచినప్పటికీ పెండింగ్ బిల్లు రూ.4 లక్షలు ఇవ్వకుండా సంబంధిత అధికారులు జాప్యం చేయడాన్ని నిరసిస్తూ భవన నిర్మాణ కాంట్రాక్టర్ పురుగుమందు డబ్బా చేతులో పట్టుకుని పాత పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. యానంబైల్‌లో 2018లో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం రూ.14 లక్షలు నిధులు మంజూరు కాగా వాటితో అదే గ్రామానికి చెందిన తొంగల వెంకన్న కాంట్రాక్టు తీసుకుని భవన నిర్మాణం పూర్తి చేశారు. రావాల్సిన బిల్లుల కోసం కార్యాలయం, అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదు. భవన నిర్మాణం పూర్తి చేసి ఏళ్లు గడిచినప్పటికీ పెండింగ్ బిల్లు రూ.4 లక్షలకు పైగా రావాల్సి ఉండగా బిల్లు ఇవ్వకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని, బిల్లు ఇవ్వకుంటే ఆత్మహత్యే శరణ్యమని వెంకన్న పురుగులమందు డబ్బాతో పాత పంచాయతీ కార్యాలయంలో బైఠాయించాడు.

పేకాట శిబిరంపై దాడి

దమ్మపేట: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసిన ఘటన మండల పరిధిలోని వడ్లగూడెం గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం సాయంత్రం వడ్లగూడెం గ్రామ శివారులో గల పామాయిల్ క్షేత్రంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఎస్ఐ శ్రావణ్‌కుమార్ వెంటనే తన సిబ్బందితో కలసి శిబిరంపై దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, మూడు బైక్‌లను స్టేషన్‌కు తరలించారు. రూ.3000 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

పన్నెండేళ్ల తర్వాత పరీక్ష

- అర్చకులకు ఏళ్ల తర్వాత అవకాశం
- ఉత్తీర్ణులైతే దేవాదాయ శాఖలో ఉద్యోగాలకు అర్హత
- ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన అభ్యర్థులు
- నేడు కూడా కొనసాగనున్న రాత, మౌఖిక పరీక్షలు



పరీక్ష రాస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: ఆలయాల్లో అర్చకత్వం చేసేందుకు అర్హులైన వారిని గుర్తించేందుకు గాను ప్రభుత్వం అర్చక ఆగమ పరీక్షలు నిర్వహిస్తోంది. అయితే, తెలంగాణ రాక ముందే నాలుగేళ్ల కిందట పరీక్ష జరగగా, ఆ తర్వాత మళ్లీ నిర్వహించలేదు. తెలంగాణలో తొలిసారిగా ప్రస్తుతం అర్చక ఆగమ పరీక్షలు ఏర్పాటుచేశారు. పన్నెండేళ్ల తర్వాత ఈ పరీక్షలు నిర్వహిస్తుండగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఖమ్మంలోని ఎస్‌బీఐటీలో కేంద్రం ఏర్పాటుచేశారు. రెండు రోజుల పాటు జరిగే పరీక్షలకు నోడల్ అధికారిగా దేవాదాయ, ధర్మాదాయ సహాయ కమిషనర్ ఎ.సులోచన వ్యవహరిస్తుండగా, దేవాదాయ శాఖ ఉద్యోగులను ఇన్విజిలేటర్లుగా, పరిశీలకులుగా నియమించారు. రెండు జిల్లాల్లో కలిపి రాత పరీక్షకు 227 మంది, మౌఖిక పరీక్షకు 107 మంది అర్చకులు దరఖాస్తు చేసుకోగా, 40 ఏళ్ల లోపు వారికి రాత, మౌఖిక పరీక్షలు, 40 ఏళ్లు పైబడిన వారికి మౌఖిక పరీక్ష నిర్వహిస్తారు. తొలిరోజైన శుక్రవారం పరీక్షలు సజావుగా సాగాయి.

అర్చకులుగా అర్హత కోసం..

అర్చకులుగా అర్హత సాధించేందుకు గాను అర్చక ఆగమ పరీక్షను ప్రభుత్వం నిర్వహిస్తోంది. సంస్కృతంలో ప్రావీణ్యత సాధించి, అర్చకత్వంపై అవగాహన కలిగిన వారు దరఖాస్తు చేసుకుంటే సంస్కృత పరీక్షలో ప్రవేశ, వర, ప్రవర పరీక్షలు నిర్వహిస్తారు. ప్రవేశలో నిత్యారాధన, వరలో ఉత్సవం, ప్రవరలో ప్రతిష్ఠ వంటి అంశాలపై పరీక్ష ఉంటుంది. అలాగే, మౌఖిక పరీక్షలు కూడా నిర్వహించి అర్హత సాధించిన వారికి ప్రభుత్వం ధ్రువపత్రాలు అందజేసి అర్చకులుగా గుర్తిస్తుంది. తద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ ఆలయాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రధానంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖలో అర్చకులుగా ఉద్యోగం సాధించాలంటే ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి. అలాగే, ప్రైవేట్ ఆలయాల్లో కూడా సర్టిఫికెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తారు. దీంతో పన్నెండేళ్ల తర్వాత నిర్వహించిన పరీక్షకు 300 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు.



ప్రశ్నపత్రాల బండిళ్లు తెరుస్తున్న అధికారులు

తొలిరోజు సాఫీగా

ఖమ్మం ఎస్‌బీఐటీ కళాశాలలో శుక్రవారం జరిగిన అర్చక ఆగమ రాత పరీక్షలకు 227 మంది దరఖాస్తు చేసుకోగా, ఉదయం 185 మంది, మధ్యాహ్నం 186 మంది హాజరయ్యారు. వారికి ప్రవేశ, వర, ప్రవర పరీక్షలు, నిర్వహించారు. పరీక్షలను దేవాదాయ, ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు పర్యవేక్షించారు. కాగా, శనివారం ఉదయం కూడా రాతపరీక్ష, మధ్యాహ్నం మౌఖిక పరీక్ష ఉంటుందని పరీక్షల నోడల్ అధికారి ఎ.సులోచన తెలిపారు.

ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం..



అర్చక ఆగమ పరీక్షలు నిర్వహించి పన్నెండేళ్లు అవుతోంది. ఏటా పరీక్షలకు నోటిఫికేషన్ పడుతుందని వేచి చూశాం. ఎట్టకేలకు ఈసారి ప్రభుత్వం పరీక్ష నిర్వహించడం ఆనందంగా ఉంది. ఈ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించడం ద్వారా ధ్రువీకరణ పత్రం పొందితే ప్రయోజనకరంగా ఉంటుంది.

– కొదమసింహం భరద్వాజ ఆచార్యులు, ఖమ్మం

పరీక్షతో అర్చకుడిగా గుర్తింపు



అర్చక ఆగమ పరీక్షతో అర్చకుడిగా గుర్తింపు లభిస్తుంది. ఈ అర్హతతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. వృత్తిలో భవిష్యత్ ఉంటుంది. పరీక్ష కోసం కొన్నాళ్లగా సిద్ధమవుతున్నాం. ప్రవేశ, వర, ప్రవర పరీక్షలు రాస్తున్నా. దేవాదాయ శాఖలో ఉద్యోగమే లక్ష్యంగా ఈ పరీక్షకు హాజరయ్యాను.

– వినుకొండ వాసుదేవాచార్యులు, ఖమ్మం

ప్రశాంతంగా పరీక్షలు



ఉమ్మడి జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఉదయం, సాయంత్రం ప్రవేశ, వర, ప్రవర పరీక్షలను నిర్వహించాం. ఉదయం 185 మంది, సాయంత్రం 186మంది పరీక్షకు హాజరయ్యారు. శనివారం రాత, మౌఖిక పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం.

– ఎ.సులోచన, పరీక్షల నోడల్ అధికారి

మతోన్మాద బీజేపీని సమష్టిగా ఎదుర్కొందాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- ఇల్లెందులో నియోజకవర్గ స్థాయి సమావేశం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, పక్కన నాయకులు

ఇల్లెందు: మతం పేరిట దేశాన్ని నాశనం చేస్తున్న బీజేపీని సమష్టిగా ఎదుర్కొనేందుకు అందరూ కలిసి రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఇల్లెందులో పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం శుక్రవారం ఏర్పాటుచేయగా పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగదాంబ సెంటర్‌లో పార్టీ 98వ వార్షికోత్సవ స్తూపాన్ని ఆవిష్కరించాక నిర్వహించిన సమావేశంలో సాంబశివరావు మాట్లాడారు. రాష్ట్రంలో లౌకిక శక్తుల బలోపేతం కావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. సీపీఐ గ్రామస్థాయి నుంచి పటిష్టపర్చాలని శ్రేణులకు సూచించారు. మూడు జిల్లాల్లో ఇల్లెందు నియోజకవర్గం విస్తరించి ఉన్నందున మూడు జిల్లాల సీపీఐ కార్యదర్శులను సమన్వయం చేసి పార్టీని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. కాగా, దేశంలో మోదీ, అమిత్‌షా నాయకత్వాన బీజేపీ స్వావలంబన, స్వదేశీ, విదేశీ పేరుతో పబ్లిక్ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తున్నారని దుయ్యబట్టారు. దేశంలో బ్రిటీష్ పాలన కాలంలో ఒక్క పరిశ్రమ ఉండగా స్వాతంత్ర్యానంతరం 400 పరిశ్రమల ఏర్పాటు దిశగా పురోభివృద్ధి సాధించామన్నారు. అలాంటి పరిశ్రమలను తెగనమ్ముతున్నారని విమర్శించారు. దీనికి తోడు దేశ వ్యాప్తంగా 300 బొగ్గు బ్లాకులను అమ్మకానికి పెట్టారని, ఇందులో ఇల్లెందులోని కేటీసీ-3 కూడా ఉందని తెలిపారు. సీపీఐ రాష్ట్ర నాయకులు బాగం హేమంతరావు మాట్లాడుతూ వామపక్షాలు ఐక్యత దిశగా ముందుకు సాగుతుండటం శుభ సూచికమని చెప్పారు. సమావేశంలో భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల సీపీఐ కార్యదర్శులు ఎస్కే సాబీర్‌పాషా, పోటు ప్రసాద్, విజయ్‌సారథి, నాయకులు మిర్యాల రంగయ్య, కె.సారయ్య, దేవరకొండ శంకర్, కట్టబోయిన శ్రీనివాస్, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, బంధం నాగయ్య, ఉడుత ఐలయ్య, కృష్ణ, ఏపూరి లలితాదేవి, కౌన్సిలర్ రవీందర్, హరీశ్‌గౌడ్, రాంచందర్, నజీర్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ విజేత వరంగల్

- మూడో స్థానంతో సరిపెట్టుకున్న ఖమ్మం

ఖమ్మంస్పోర్ట్స్: రెండు రోజులుగా ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ మేరకు ఫైనల్‌లో వరంగల్ – హైదరాబాద్ జట్లు తలపడగా 11–10 గోల్స్ తేడాతో వరంగల్ జట్టు ఘన విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. హైదరాబాద్ బాలికల జట్టు రెండో స్థానంలో నిలిచింది. అలాగే, మూడో స్థానం కోసం జరిగిన పోటీలో ఖమ్మం–మహబూబ్‌నగర్ జట్లు తలపడగా ఖమ్మం 18 గోల్స్ చేసింది. మహబూబ్‌నగర్ ఏడు గోల్స్ మాత్రమే చేయడంతో ఖమ్మం జట్టు గెలిచి మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విజేత జట్టుతో పాటు రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోట్ల శ్రీకాంత్, డాక్టర్ పాటిబండ్ల రఘునందన్, మిత్ర ఫౌండేషన్ అధినేత కురువెళ్ల ప్రవీణ్‌కుమార్‌తో పాటు రాము, శ్రీనివాస్, కృష్ణయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై దాడికి మావోయిస్టుల యత్నం

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై మావోయిస్టులు శుక్రవారం రాత్రి దాడికి యత్నించగా బలగాలు ప్రతిఘటించాయి. జిల్లాలోని పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై ఈనెల 3న మధ్యాహ్నం 3 గంటలకు మావోయిస్టులు దాడికి యత్నించారు. బలగాలు ప్రతిఘటించడంతో పారిపోయారు. మళ్లీ శుక్రవారం రాత్రి కూడా అదే ప్రయత్నం చేయగా, అప్రమత్తమైన క్యాంపు బలగాలు ఎదురుకాల్పులు జరపడంతో పారిపోయారు. మూడు రోజుల వ్యవధిలోనే రెండు సార్లు కాల్పులకు దిగడాన్ని బట్టి చూస్తే మావోయిస్టులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని పోలీసులు అభిప్రాయపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన బాబూరావు

మణుగూరురూరల్: ఆటో ట్రాలీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని హనుమాన్‌టెంపుల్ వద్ద నివాసముంటున్న చెన్నూరి బాబూరావు తన వ్యక్తిగత పనుల రీత్యా ద్విచక్రవాహనంపై ప్రధాన సెంటర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుట్టమల్లారం ప్రాంతానికి చేరుకోగానే ఆటో ట్రాలీ, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. బాబూరావు ద్విచక్ర వాహనం పైనుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రున్ని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వింత ఆకృతిలో మేక పిల్ల జననం



వింత ఆకృతిలో జన్మించిన మేకపిల్ల

ఇల్లెందురూరల్: మండలంలోని మస్సివాగు తండా గ్రామంలో శుక్రవారం వింత ఆకృతిలో మేకపిల్ల జన్మించింది. గ్రామానికి చెందిన బానోత్ చందు అనే మేకల కాపరికి చెందిన మేక ప్రసవంచింది. జన్మించిన మేకపిల్లకు తల వింత ఆకృతిలో ఉండటంతో తొలుత కంగారుపడ్డ చందు నిశితంగా పరిశీలించాడు. దానికి తల భాగం లేకపోవడాన్ని గుర్తించాడు. విషయం తెలియడంతో వింత ఆకృతిలో జన్మించిన మేక పిల్లను చూసి స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు.

వృద్ధ దంపతులకు గాయాలు

దమ్మపేట: ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో వృద్ధ దంపతులకు గాయాలైన ఘటన శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఆంధ్ర ప్రాంతంలోని అల్లిపల్లి గ్రామానికి చెందిన దంపతులు ములకల రామచంద్రరావు (60), సూర్యకాంతం (58) దమ్మపేట బైక్‌పై వస్తున్నారు. గ్రామ శివారులోని ఎస్ఎస్ వైన్స్ సమీపంలోని డివైడర్ దాటే క్రమంలో మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తిని మల్కారం గ్రామానికి చెందిన కిరణ్‌గా స్థానికులు గుర్తించారు.

వాహనాల షోరూంలో చోరీ

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని బజాజ్ షోరూంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. షోరూంలో ఉన్న రూ.2లక్షలు నగదును గుర్తుతెలియని దుండగులు అపహరించారు. ఎస్ఐ ప్రవీణ్ కథనం ప్రకారం.. షోరూం పక్కన ఉన్న ఇంట్లో నుంచి దుండగులు లోపలికి ప్రవేశించారు. షెట్టర్ పగలగొట్టి తొలుత సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. వీడియో రికార్డర్‌ను అపహరించారు. అక్కడే ఉన్న కౌంటర్‌లో రూ.20వేలు, యాజమాని శ్రీనివాసరావు కౌంటర్‌లో ఉన్న రూ.1.80 లక్షలు అపహరించారని ఎస్ఐ తెలిపారు. కాగా, ఘటనా స్థలాన్ని శుక్రవారం సీఐ రమాకాంత్, ఎస్ఐ ప్రవీణ్, క్లూస్‌టీం సందర్శించారు. షోరూం యజమాని శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. అయితే, 2021, ఏప్రిల్‌లో కూడా షోరూం రూ.2.90 లక్షలను అపహరించారని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



దగ్ధమవుతున్న పూరిల్లు

అశ్వాపురం: ప్రమాదవశాత్తు పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని ఎలకలగూడెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన రైతు కలేటి నాగేశ్వరరావు పత్తి పంట సాగు చేశాడు. కొంత విక్రయించి కొంత ఇంట్లో నిల్వ ఉంచాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో వారంతా పనులకు వెళ్లగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. ఇంట్లోని సామగ్రి మొత్తం కాలిపోయింది. ఇటీవల పత్తి విక్రయించగా వచ్చిన సుమారు రూ.60 వేలలు నగదు, 10 క్వింటాళ్ల పత్తి, బట్టలు, సామగ్రి పూర్తిగా కాలిబూడిదయ్యాయని నాగేశ్వరరావు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, నాగేశ్వరరావుకు ఇద్దరు కుమార్తెలు ఉండగా ఒక అమ్మాయి బీఎంఎల్‌టీ, ఒక అమ్మాయి ఇంటర్ చదువుతుండగా ఇద్దరు అమ్మాయిల చదువుకు సంబంధించిన ధ్రువపత్రాలు మంటల్లో కాలిపోయాయి. సర్పంచ్ కలేటి నరసింహారావు, రెవెన్యూ అధికారులు దగ్ధమైన పూరిల్లును పరిశీలించి వివరాలు సేకరించారు.

కరకగూడెంలో..



దగ్ధమైన పూరిల్లు

కరకగూడెం: షార్ట్ సర్క్యూట్‌తో ఓ పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని చొప్పాల గ్రామానికి చెందిన మెంతినబాబు శుక్రవారం తాను రోజువారి కూలీ పనులకు వెళ్లిన సమయంలో స్విచ్‌బోర్డులో మంటలు వచ్చి ఇంట్లోని సామగ్రికి అంటుకుని క్రమంగా మంటలు పెరిగి పూరిల్లు దగ్ధమైంది. దీంతో బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేశారు. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందని డీటీ సంధ్య తెలిపారు. అనంతరం బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసరాలను అందించినట్లు చెప్పారు.

సైబర్ నేరంపై ఫిర్యాదు

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామంలో వారం రోజుల కిందట జరిగిన సైబర్ నేరంపై బాధితుడి ఫిర్యాదుతో శుక్రవారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సిద్ది ప్రవీణ్‌కు గత నెల 25న ఫోన్ వచ్చింది. ఆ ఫోన్‌లో 'మీ బంధువుకు సంబంధించిన నగదు రూ.38 వేలు పంపిస్తున్నాం.. ఫోన్ పే చూడండి' అని తెలిపాడు. అనంతరం ప్రవీణ్ ఫోన్ పే ఓపెన్ చేసి పిన్ నంబర్ ఎంటర్ చేయగా ప్రవీణ్ ఖాతాలోని సుమారు రూ.90 వేలు డ్రా కావడంతో ఖంగుతిన్నాడు. అనంతరం తనకు ఫోన్ చేసిన వ్యక్తికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి తన బంధువుపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు సైబర్‌క్రైం పోలీసుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు.

17 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

టేకులపల్లి: అక్రమంగా తరలిస్తున్న నిషేధిత నల్లబెల్లాన్ని టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం తడికలపూడి క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీల్లో భాగంగా అనుమానిత వాహనాన్ని పట్టుకున్నారు. గుగులోత్ సైదులు అనే వ్యక్తి ట్రాలీలో రాజమండ్రి నుంచి నెల్లికుదురుకు నల్లబెల్లం రవాణా చేస్తుంటాడని విచారణలో వెల్లడైంది. దీంతో సైదులును అరెస్టు చేశారు. ట్రాలీలో ఉన్న 17 క్వింటాళ్ల నల్లబెల్లం, 4 క్వింటాళ్ల పటిక, వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

నలుగురు మైనర్లు అరెస్ట్

పాల్వంచరూరల్: పగలు పనులు చేసుకుంటూ రాత్రి దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తొగ్గూడెంలో క్రషర్ మిల్లుకు చెందిన మోటారును గురువారం ఓ వ్యక్తి చోరీ చేస్తుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అతడిని పట్టుకుని విచారించారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన బాలురతో కలిసి ఇటీవల నాగారంలోని స్టోన్‌క్రషర్‌మిల్లులో రూ.70 వేల విలువగల సామగ్రి చోరీ చేసినట్లు అంగీకరించాడు. శుక్రవారం బాలురను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

బస్టాండ్‌లో వ్యక్తి మృతి

ఇల్లెందు: స్థానిక బస్టాండ్‌లో ఓ వ్యక్తి మృతి చెందాడు. పట్టణంలోని 2వ వార్డుకు చెందిన పెరిక భాస్కర్ (48) తాగుడుకు బానిసయ్యాడు. బస్టాండ్‌లోనే నిద్రిస్తుంటాడు. శుక్రవారం రాత్రి బస్టాండ్‌లో సిమెంటు బల్లా మీద పడుకుని నిద్రలోనే మృతి చెందాడు. ఇల్లెందులపాడుకు చెందిన పెరిక పద్మ, వెంకటయ్య మూ డో సంతానం భాస్కర్. సింగరేణి ఉద్యోగం చేస్తూ తాగుడుకు బానిసై విధులకు గైర్హాజర్ కావడంతో ఉద్యోగం కోల్పోయ్యా డు. భాస్కర్‌కు ఇద్దరు అన్నలు, ఒక చెల్లి, తల్లి పద్మ ఉన్నారు. బస్టాండ్‌లో భాస్కర్ మృతి చెందిన సమాచారం అందుకున్న కౌన్సిలర్ కటకం పద్మావతి పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం ఇల్లెందులపాడు శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.